



విజయపురం మండలంలో మొరవపారుతున్న పాతార్యాడు చెరువు

మళ్లీ వర్షాలు

● ఇళ్లకే పరిమితమైన జనం ● నేడు కూడా వర్ష సూచన

చిత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం తెల్లవారుజాము న ప్రారంభమైన వర్షం రోజంతా ఎడతెరపి లేకుండా పడడంతో ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. జడివానకు చలిగాలులు తోడవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇటీవల ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పలు చెరువులు, రిజర్వాయర్లు నిండాయి.తాజా వర్షాలతో అవన్నీ పొంగి పొర్లాయి. పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం 3 గేట్లను ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమల మండలంలోని గురునాథం చెరువుకు గండి పడింది.నగరి కుశస్థలీ నదిలో వరద ఉధ్రుతి పెరగడంతో అటువైపు వాహనదారులు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరించారు. నాగలాపురం రోడ్డు చివరలోని వంతెన మార్గంలో వెళ్లాలని సూచించారు. విజయపురంలో పాతార్యాడు చెరువు మొరవపోయింది. మండలంలోని కమ్మకండ్రిగ, మాధవరం, ఆలపాకం పెద్ద చెరువు మినహా మిగిలిన చెరువులు నిండి మొరవ పారుతున్నాయి.యాదమరి మండలంలోని చిత్తూరు- గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి జంక్షన్ వద్ద వర్షపు నీరు నిండింది. పాలసముద్రం మండలంలోని చిత్తూరు బలిజకండ్రిగ రోడ్డులో వెంగళ్రాజకుప్పం బ్రిడ్జిపై నీళ్లు ప్రవహిస్తున్నాయి.ఎస్ఆర్ పురం మండలంలోని ఎగువ కమ్మకండ్రిగ, ఆర్ఆర్‌పురం వాగులు పొంగిపొర్లుతుండడంతో 15 గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు కట్ అయ్యాయి.పాపిరెడ్డిపల్లె, పాతపాలెం, జీఎంఆర్ పురం, దిగువకమ్మకండ్రిగ, ఎగువ కమ్మకండ్రిగ వాగుల్లో ఉధృతంగా నీళ్లు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.జేసీ, ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి గురువారం ఉదయం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఆమె ప్రకటన వచ్చేలోపు కొన్ని ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు చేరుకోవడంతో.. వెనక్కి పంపలేక కొన్నిచోట్ల తరగతులు నిర్వహించాల్సి వచ్చింది.వాతావరణ శాఖ సూచనల ప్రకారం శుక్రవారం కూడా జిల్లాలో వర్షాలు పడనున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించే అవకాశముంది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం కలెక్టరేట్‌తో పాటు చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూముల్ని ఏర్పాటు చేశారు.

నగరిలో 52 మి.మీ వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు 21 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా నగరి మండలంలో 52 మి.మీ , అత్యల్పంగా పలమనేరులో ఒక మిమీ వర్షపాతం నమోదయ్యింది.విజయపురంలో 40.8మిమీ, నింద్రలో 36.2మిమీ, కార్వేటినగరంలో 36.4, పెనుమూరులో 23.4, శ్రీరంగరాజపురంలో 18.4, చిత్తూరులో 18.4, గంగాధరనెల్లూరులో 18.2, గుడిపాలలో 14.8, పాలసముద్రంలో 12.6, చిత్తూరు రూరల్‌లో 10.6, రొంపిచెర్లలో 8.8, యాదమరిలో 8.4, పులిచెర్లలో 6.8, పూతలపట్టులో 5.8, వెదురుకుప్పంలో 5.2, బంగారుపాళ్యంలో 3.2, తవణంపల్లెలో 2.6, సదుంలో 1.4, గంగవరంలో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.



నగరి మండలం ఎం.కొత్తూరులో నీట మునిగిన వరిపంట



చిత్తూరులో వర్షం



పాఠశాలకు సెలవు ప్రకటించడంతో వర్షంలోనే ఇంటికి వెళ్తున్న చిత్తూరు విద్యార్థి

ప్రపంచ చెస్ ఛాంపియన్

గుకేష్ మనవాడే

చెంచురాజు కండ్రిగలో సంబరాలు



పిచ్చాటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):పద్దెనిమిదేళ్ల వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుని చరిత్ర సృష్టించిన యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజు పూర్వీకులది ఉమ్మడి చిత్తూరు జిల్లా కావడం విశేషం.పిచ్చాటూరు మండలం లోని చెంచురాజు కండ్రిగకు చెందిన భూస్వామి శంకర్‌రాజు మనవడే గుకేష్. రైల్వే ఉద్యోగిగా చెన్నై తరలివెళ్లిన శంకర్‌రాజు కొడుకైన రజనీకాంత్ అక్కడే డాక్టర్‌గా స్థిరపడ్డారు.నగరానికే చెందిన డాక్టర్ పద్మావతిని వివాహమాడారు.తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గుకేష్ చిన్నప్పటినుంచీ చెస్ క్రీడపై మక్కువ పెంచుకుని ప్రతిభ చాటుతూ వచ్చాడు.శంకర్‌రాజుకు చెంచురాజు కండ్రిగలో భూములతో పాటు రైస్ మిల్ కూడా వుండడంతో అప్పుడప్పుడూ సొంతూరికి వచ్చిపోతుంటారు.గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్ కావడంతో చెంచురాజుకండ్రిగ గ్రామస్తులు సంతోషంలో మునిగితేలుతున్నారు.

గ్రామాల్లో సదుపాయాల కల్పనకు

నిధులు పెంచండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్ విజ్ఞప్తి



సదస్సులో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారుల నిర్మాణానికి నిధుల కేటాయింపు పెరగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు.అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో గురువారం సుమిత్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల నుంచి ప్రతి గ్రామ పంచాయతీకి రూ.9 కోట్ల మేర ఖర్చు చేసేందుకు అనుమతి ఉందని కలెక్టర్ వివరించారు. ఈ నిధుల్ని అవసరం మేరకు రహదారులపై గుంతలు పూడ్చడానికి వినియోగించుకునేందుకు అవకాశమివ్వాలని కోరారు. డ్రైనేజీల కోసం రూ.లక్ష మాత్రమే మంజూరు చేశారని గుర్తు చేస్తూ, వీటితో పాటు అంగన్వాడీ భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు, మరమ్మతులకు ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలో చెక్‌డ్యామ్ నిర్మాణాలు, మరమ్మతులకు రూ.40 లక్షల వరకు ఉపాధి నిధుల్ని వినియోగించుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో ఈ నిధులు సరిపోవడం లేదని, రూ.కోటి కేటాయించాలని ఆయన సీఎం చంద్రబాబును కోరారు.

● పెట్టుబడుల సమావేశాలపై సీఎం అసంతృప్తి

పెట్టుబడులకు సంబంధించి చిత్తూరు జిల్లాలో నిర్వహించాల్సిన సమావేశాల పట్ల కలెక్టర్లు శ్రద్ధ కనపరచడం లేదని సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ల సదస్సులో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజు ఆ శాఖ పురోగతి గురించి ప్రజంటేషన్ ఇచ్చారు. దానిపై సీఎం మాట్లాడుతూ..చిత్తూరు,అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అస్సలు ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం సరికాదన్నారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పనులు వేగవంతంగా చేయాలన్నారు. జిల్లాకు ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి, వాటి ద్వారా ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తున్నామనే అంశాలపై కలెక్టర్ దృష్టి పెట్టాలన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సుకు దీనిపై స్పష్టమైన వివరాలతో రావాలని సూచించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు లీగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 22 బెంచీలలో లోక్ జరుగుతుందన్నారు. 14న ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

16నుంచి ముక్కంటి ఆలయ దర్శన వేళల్లో మార్పులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.తెల్లవారుజామున 3 గంటలకు జేగంట,4గంటలకు మంగళ వాయిద్యాలు, 4.15గంటలకు గోపూజ, తిరుమంజనం, 4.30గంటలకు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారము ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 5గంటలకు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం(సేవలు లేవు), 6గంటలకు రెండో కాలాభిషేకం, 7గంటలకు పరివార దేవతా నైవేద్యం,7.30గంటలకు గొబ్బెమ్మవార్ల ఉత్సవం, 10.30గంటలకు మూడవ కాలాభిషేకం (ఉచ్చికాలం), సాయంత్రం 5గంటలకు ప్రదోష కాలాభిషేకం, శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9గంటలకు పల్లియపూజ, దర్శనం ముగింపు వుంటుందన్నారు. మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9 గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని ఈవో వివరించారు.

రేంజర్ చేతివాటం

●చెట్ల తొలగింపు పేరిట నిధుల డ్రా
●శాఖాపరమైన విచారణ ప్రారంభం



రేంజర్ శివన్న




సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్

పలమనేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అటవీశాఖకు చెందిన ఓ అధికారి చేతివాటం బయటపడింది.చెన్నై-బెంగళూరు మధ్య ఎక్స్‌ప్రెస్ హైవే పలమనేరు అటవీ ప్రాంతం గుండా వెళ్తుంది. ఈక్రమంలో అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపునకు అటవీశాఖకు దాదాపు రూ.20 లక్షలు కేటాయించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులు చెట్ల తొలగింపులో జాప్యం చేశారు. దీంతో హైవే సంస్థ అధికారులే చొరవ తీసుకుని చెట్లను తొలగించారు. దీన్ని గతేడాది రేంజర్‌గా పనిచేసిన శివన్ తనకు అనువుగా మార్చుకున్నారని తెలిసింది. చెట్ల తొలగింపు నిధులను గుట్టు చప్పుడు కాకుండా మూడు చెక్కులతో డ్రా చేసినట్లు సమాచారం. ఈ ఏడాది సాధారణ బదిలీల్లో ఆయన రాజంపేటకు వెళ్లారు.మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన బదిలీ అయిన నెలరోజుల తర్వాత నిధుల స్వాహా విషయం బయటపడింది. ఈ అంశంపై విచారణ జరపాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఇక్కడి సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్‌ను ఆదేశించారు. ప్రాథమిక విచారణ జరిపిన సబ్ డీఎఫ్‌వో గురువారం విలేకరులతో మాట్లాడుతూ నిధుల స్వాహా జరిగిన విషయం వాస్తవమేనన్నారు. రేంజర్‌స్థాయి అధికారికి సాధారణంగా రూ.50వేలు పరిధి ఉన్న చెక్కు డ్రాచేసే అధికారం ఉంటుందన్నారు. ఇందుకు భిన్నంగా శివన్న చెక్కులను మార్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఎంత మేర నిధుల స్వాహా జరిగిందో పూర్తి విచారణలో తేలనుందన్నారు. కాగా కీలపట్ల పంచాయితీ జరావారిపల్లి పొలిమేరల్లో పందిని చంపిన కేసులో నిందితుల నుంచి రూ.1.60లక్షలు వసూలు చేసి అటవీశాఖ ఖాతాలోకి జమచేయని సంఘటనలో కూడా అప్పటి రేంజర్ శివన్న ప్రమేయముందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ కేసుపై కూడా విచారణ జరుగుతోందని సబ్ డీఎఫ్‌వో వివరించారు.

టూరిజం పాలసీలో దక్కని ప్రాధాన్యం

● ఆధ్యాత్మిక సర్క్యూట్‌లో కాణిపాకానికి మాత్రమే చోటు



చిత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ టూరిజం పాలసీలో చిత్తూరు జిల్లాకు ప్రాధాన్యం దక్కలేదు. జిల్లాల విభజనతో చెప్పుకోదగ్గ పర్యాటక ప్రాంతం చిత్తూరులో లేకుండా పోయింది. వైసీపీ హయాంలో రెండేళ్లకుపైగా పర్యాటక శాఖామంత్రిగా పనిచేసిన రోజా కూడా జిల్లాపరంగా పర్యాటక అభివృద్ధిని పట్టించుకోలేదు.కూటమి ప్రభుత్వ నూతన టూరిజం పాలసీలో ఆధ్యాత్మిక సర్క్యూట్‌లో భాగంగా కాణిపాక ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది.రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా కొత్త పాలసీని అమల్లోకి తెస్తున్న ప్రభుత్వం.. ఇందులో గుర్తింపు పొందిన ప్రాంతాలకు సరైన ప్రోత్సాహం, నిధుల్ని కేటాయించనుంది. ఈ క్రమంలో ఈ పాలసీలో స్థానం దక్కి ఉంటే మన జిల్లా కూడా పర్యాటకంగా అభివృద్ధి చెందేది. టెంపుల్, ఎకో టూరిజం దిశగా అభివృద్ధి చేస్తే చిత్తూరు జిల్లాకు కూడా పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

● పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం, కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయం, యాదమరి మండలంలోని నుంజర్ల ప్రాజెక్టు, బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్, పలమనేరులోని గంగనశిరస్సు జలపాతాలను అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయి.అయితే ప్రస్తుతానికి ఇక్కడికి వెళ్లడానికి సరైన రోడ్లు కూడా లేవు.పెనుమూరు మండలంలోని పులిగుండును పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలున్నాయి. బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మెండుగా అవకాశాలున్నాయి. ఇప్పటికే ప్రజలు పెద్దఎత్తున అమ్మవారి దర్శనానికి వస్తున్నారు.ఆలయానికి రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. దీన్ని అభివృద్ధి చేస్తే మరింత ఆదాయం సమకూరుతుంది.రామకుప్పంలోని ననియాల ఎకో టూరిజం ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయగా, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.ఈ ప్రాజెక్టును కూడా అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలున్నాయి.

● పర్యాటక మంత్రిగా మేలు చేయని రోజా

వైసీపీ హయాంలో రాష్ట్ర పర్యాటక మంత్రిగా రెండేళ్లకు పైగా పనిచేసిన రోజా జిల్లాకు కనీసం ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదు. కాణిపాకానికి సమీపంలో కొత్తపల్లి దగ్గర శిల్పారామం ఏర్పాటు చేస్తామని రోజా ప్రకటించగా.. అధికారులు స్థలాన్ని పరిశీలించారంతే.ఆ తర్వాత పురోగతి లేదు. పుత్తూరు పరిధిలోని మూలవంక జలపాతం పరిసరాలను అభివృద్ధి చేస్తే వారాంతాల్లో జిల్లాతో పాటు పొరుగునే ఉన్న తమిళనాడు నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తారు.

ఉద్యానవనాల పేరుతో రూ.లక్షలు దోచారు!

● సామాజిక తనిఖీల్లో బహిర్గతం ● రైతులనుంచి రూ.8.80 లక్షల రికవరీకి ఆదేశాలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

రామకుప్పం/శాంతిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఉద్యానవనాల పెంపకం పేరిట రూ.లక్షలు మింగేశారు. సామాజిక తనిఖీల్లో ఈ బాగోతం బహిర్గతమైంది. దుర్వినియోగమైన రూ.8.80 లక్షల రికవరీకి తాజాగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శాంతిపురం మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చినెలాఖరు వరకు ఉపాధి హామీ పథకం కింద రూ.8.70కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులపై గతనెల 22 నుంచి ఈనెల 4వరకు సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. 5న సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. అయితే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు, సిబ్బంది హాజరు కాకుండా ప్రజావేదిక నిర్వహించడం పట్ల టీడీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ప్రజావేదికను వాయిదా వేశారు. గురువారం తిరిగి మండల సచివాలయంలో అదనపు ఏపీడీ మల్లికార్జున, కుప్పం క్లస్టర్ ఏపీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించారు. 27పంచాయతీల్లో జరిగిన పనులను తనిఖీ చేశారు. ఉద్యానవనాల పెంచకుండానే నిధులు దిగమింగినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది ప్రజావేదికలో వెల్లడించారు.మండల పరిధిలో రూ.8.80లక్షలు దుర్వినియోగం జరిగినట్లు వారు నివేదికలో పేర్కొన్నారు. ఇందులో చిన్నారిదొడ్డి పంచాయతీలో రూ.1.83లక్షలు, కర్లగట్ట పంచాయతీలో రూ.1.40లక్షలు, నడింపల్లె పంచాయతీలో రూ.97వేలు, మఠం పంచాయతీలో రూ.89వేలు నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. దుర్వినియోగమైన రూ.8.80లక్షలను సంబంధిత రైతుల నుంచి రికవరీ చేయాలని అదనపు ఏపీడీ మండల అధికారులను ఆదేశించారు. మొక్కలు లేకుండా చెల్లింపులు ఎలా జరిగాయనే అంశంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. తనిఖీ ప్రజావేదికలో టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, ఎంపీడీవో కుమార్, ఉపాధి హామీ ఏపీవో హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



వానలోనే చక్రతీర్థ ముక్కోటి

తిరుమలలో జోరున కురుస్తున్న వానలోనే గురువారం చక్రతీర్థ ముక్కోటి జరిగింది. కార్తీక సమయంలో దీన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం వానలోనే మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి చక్రతీర్థానికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ చక్రత్తాళ్వారుకు, నరసింహ స్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



హ్యాపీ బర్త్‌డే రజనీకాంత్

ప్రసిద్ధ నటి రాధిక తిరుమల నుంచి శుక్రవారం పుట్టిన రోజు జరుపుకుంటున్న రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాధిక దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రజనీకాంత్ ఆరోగ్యంతో ఉండాలని స్వామి సన్నిధి నుంచి కోరుకుంటున్నానన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.88 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,887
తలనీలాలు సమర్పించినవారు: 25,725


గోగర్భం డ్యాం నుంచి విడుదల చేసిన నీరు


తిరుమలలో దంచికొట్టిన వాన

నిండిన జలాశయాలు

తిరుమలలో వాన ముంచిపోసింది. గురువారం వేకువజామున జల్లులతో మొదలైన అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. శ్రీవారి ఆలయం ముందు, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దర్శనానికి వెళ్లేవారూ, బయటకు వచ్చేవారూ కూడా తడిచి ముద్దయ్యారు. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, షెడ్లు, కార్యాలయాల ముందే చలికి ముడుచుకుని ఉండిపోయారు. వాన కారణంగా సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణసేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	నిండిపోయి గేట్లు ఎత్తివేత
కుమారధార	4,258	4,005
పసుపుధార	1,287	1,100
గోగర్భం	2,833	నిండిపోయి గేట్లు ఎత్తివేత
ఆకాశగంగ	685	నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతోంది



ఆకాశగంగ గేట్లు ఎత్తిన దృశ్యం - నిండుకుండలా ఆకాశగంగ

నిండిన జలాశయాలు : తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లును ఎత్తివేయగా, ఆకాశగంగా డ్యాం నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతోంది. కుమారధార, పసుపుధార డ్యాముల్లోకి 90 శాతం నీరు చేరింది. శుక్రవారం వేకువజాముకు ఇవి కూడా నిండిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిల్వలతో రానున్న 350 రోజులకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులోకి వచ్చింది. తిరుమల అవసరాలకు ప్రతిరోజు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో 20 లక్షల గ్యాలన్లు తిరుమల డ్యాముల నుంచి మరో 30 లక్షల గ్యాలన్లు కల్యాణిడ్యాం నుంచి తీసుకుంటారు. గత మూడు నెల క్రితం వరకు కూడా తిరుమలలో నీటి ఇబ్బందులు వస్తాయని టీటీడీ అధికారులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంలో నీటి వినియోగంలో కొన్ని ఆంక్షలు కూడా విధించారు. అయితే తాజా వానలతో జలాశయాల్లోకి నీరునిండుగా చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పాపవినాశనం, శ్రీవారిపాదాలకు నో ఎంట్రీ

ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, ఆకాశగంగ, శ్రీవారిపాదాలు, శిలాతోరణం మార్గాలను టీటీడీ గురువారం ఉదయం మూసివేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాలలో భక్తులు జాగ్రత్తగా వెళ్లాలంటూ విజిలెన్స్ సిబ్బంది సూచనలు చేస్తున్నారు.



రెండో ఘాట్‌లో జారిన బండ

రెండవ ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. మార్గంలోని హరిణి విశ్రాంతి షెడ్‌కు సమీపంలో ఓ భారీ బండరాయితో పాటు మట్టి, చిన్నపాటి రాళ్లు రోడ్డుమీదకు జారాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారులు జారిన కొండచరియలను వేగంగా తొలగించారు. రెండు ఘాట్ రోడ్లలోనూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మూడు బృందాలు పరవేక్షిస్తున్నాయి.


లీలామహల్ వద్ద భారీ వర్షాలతో ప్రజలకు అవసరమైన సూచనలు ఇస్తున్న డీఎస్పీ

వాగులు..వంకల వద్ద పోలీసు పహారా : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎవ్వరూ అనవసరంగా బయటకు రావద్దని, వాగులు, వంకల్లో చిక్కుకుని ఇబ్బందులు పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112 లేకుంటే 8099999977కు వాట్సాప్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అండర్ బ్రిడ్జిల కింద నిర్లక్ష్యంగా వెళ్లరాదన్నారు. తిరుపతిలో దాదాపు 12 ప్రాంతాలు జలమయమయ్యాయని, పోలీసులు దగ్గరుండి పరిస్థితులను సమీక్షిస్తున్నారని తెలిపారు. కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే చోట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాళంగి 10 గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కాళంగి జలాశయం నిండుతోంది. జలాశయం సామర్థ్యం 240 అడుగులు కాగా ప్రస్తుతానికి 225 అడుగులు చేరింది దీంతో పది గేట్లను 8 అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు వదిలినట్లు ఏఈ బాబు తెలిపారు. జలాశయంలోకి 9,200 క్యూసెక్కుల నీరు చేరుతుండగా గేట్ల ద్వారా 10,080 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రధాన గేట్ల వద్ద 198 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉందన్నారు. ఇంకా పెరిగే అవకాశముంటే మరిన్ని గేట్లు ఎత్తుతామని వివరించారు.

కొట్టుకుపోయిన వంతెన

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజులకండ్రిగ సమీపంలో పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన వర్షాలకు కొట్టుకుపోయింది. విద్యార్థులు ప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాలకు, రాజులకండ్రిగలోని ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. అయితే అధికారులు స్కూళ్లకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలోనే తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక యువకులు వారిని దగ్గరుండి ఏరు దాటించారు. ఇది గమనించిన సర్పంచు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరూ ఏరు దాటకుండా సిబ్బందిని కాపలా పెట్టారు.

ఆలస్యంగా సెలవు ప్రకటన

ఇబ్బందిపడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఈనెల 11వ తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను వర్షంలో తడుస్తూనే విద్యాసంస్థలకు తీసుకెళ్లారు. తీరా అక్కడికి చేరుకున్నాక విద్యాశాఖాధికారులు సెలవు ప్రకటించారు. దీంతో తల్లిదండ్రులు మళ్లీ విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

43 ఆర్టీసీ బస్సుల రద్దు


సీబీఎస్‌లో తూములో పూడిక తొలగిస్తున్న అధికారులు

తిరుపతి (ఆర్టీసీ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో ఆర్టీసీ రవాణా స్తంభించింది. వర్షానికి ఏరులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడం, వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో 43 బస్సులను నిలిపివేశారు. తిరుమల ఘాట్ బస్సుల్లోనూ తక్కువ సంఖ్యలోనే ప్రయాణికులు కనిపించారు. సీబీఎస్‌లో నీరు పేరుకుపోవడంతో తూముల్లో పూడికతీసి బయటకు పంపే ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ రవాణా ఆగిన మార్గాలు.. బస్సులు : తిరుమల పాపవినాశనం 8, సీతకాలువ 1, ఉడమలపాడు 2, అమ్మపల్లి డ్యామ్ 1, అడవికండ్రిగచెరువు 1, కావనూరు ఏరు 1, కలవకూరుకాలువ 2, గోవర్ధనపురం 9, నారాయణవనం 12, పేర్నాడు 1, పున్నేపల్లి 1, బోయలగడ్డ 4 బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి.

దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లాలి

- ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ
- ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే
- కోడింగ్‌లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందజేత




సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ - విజేతలకు చెక్కు అందిస్తున్న ఐఐటీ అధికారులు - విద్యార్థుల సంబరాలు

ఏర్పేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి దేశం సిద్ధంగా ఉందని, ఇండియా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లడానికి విద్యార్థులు కృషి చేయాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఐఐటీ తిరుపతిలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా ఆవిష్కరణలు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించిందని ముఖ్య అతిథి స్విమ్స్ వైస్ చాన్సలర్ ఆర్వీ కుమార్ అన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్‌కుమార్ గుంజు మాట్లాడుతూ విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 మోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. తిరుపతి ఐఐటీలో డిసెంబరు 11 నుంచి 12 వరకు రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే జరిగింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించిన వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి దేశంలోని వివిధ ప్రతిష్టాత్మక కళాశాలల నుంచి 21 బృందాలు పాల్గొన్నాయి. బుధవారం ఉదయం 9.30 నుంచి గురువారం సాయంత్రం 5.30 గంటలు 36 గంటల పాటు నిరంతరాయంగా పోటీ జరిగింది.

కోడింగ్ విజేతలు వీరే..

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతిలో ఉపయోగించే విభిన్న శ్రేణి ఔషధ మొక్కలను ప్రదర్శిస్తూ వినియోగదారులకు ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్, లీనమయ్యే అనుభవాన్ని అందించే వర్చువల్ హెర్బల్ గార్డెన్‌ను సృష్టించాలని విద్యార్థుల బృందాలకు సూచించింది. ఆయుష్ రంగంలో స్టార్టప్‌ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి రిజిస్ట్రేషన్ పోర్టల్ సామర్థ్యం పారదర్శకతను మెరుగుపరచడానికి అవసరమైన ప్రణాళికలను కోడింగ్ చేయాలని విద్యార్థులకు సూచించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన స్టాక్ స్క్వాడ్ విద్యార్థుల బృందం, ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రగతి మిత్ర గ్రూప్‌నకు చెందిన విద్యార్థుల బృందం, కోడ్ క్రాఫ్ట్ విద్యార్థుల బృందం విజేతలుగా నిలిచాయి. పుణేకు చెందిన ఆర్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కార్బన్ డేటర్స్ విద్యార్థుల బృందం, మహారాష్ట్రకు చెందిన కేకే వాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థుల బృందం సంయుక్తంగా విజేతలుగా నిలిచారు.

కల్కి ఆశ్రమం నుంచి మా భూములు అప్పగించండి!

- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

వరదయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాలెం మండలంలోని కల్కి ఆశ్రమం స్వాధీనంలో ఉన్న తమ భూములను అప్పగించాలంటూ పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వరదయ్యపాలెం మండలం చెదుళ్లపాకం రెవిన్యూ గ్రామ పరిధిలో పులి పోలయ్య, చంద్రశేఖర్, నీలమ్మ, సలవాది రాము అనే వారికి గతంలో ప్రభుత్వం ఆరు ఎకరాల సీలింగ్ భూములను కేటాయించింది.వాటికి అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేసింది. అయితే 2008లో వీరు హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వం తమకు కేటాయించిన అసైన్‌మెంట్ భూములను కల్కి ఆశ్రమ నిర్వాహకులు ఆక్రమించుకుని ఆశ్రమంలో కలిపేసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.తమ భూముల్ని తమకు అప్పగించాలని కోరారు. అయితే పిటిషనర్ల తరపు ఎవరూ కోర్టులో వాదించకపోవడంతో సుదీర్ఘకాలం వేచి చూసిన హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 2008లో తాము దాఖలు చేసిన కేసును నడిపించే ఆర్థిక స్థోమత తమకు లేకపోయిందని, అందువల్ల కేసు నడపలేకపోయామని తాజాగా మరోసారి పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించి తమ భూములను తిరిగి ఇప్పించాలని వారు తాజాగా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు. రిట్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు నాలుగు వారాలకు కేసును వాయిదా వేసింది.

తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పూర్తి చేయండి

- కలెక్టర్‌కు సీఎం సూచన


సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు తీసుకుని తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. రేణిగుంట-కడప రోడ్డును కూడా పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లాను బాగా అభివృద్ధి చేయాలని సూచించారు. విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో గురువారం సీఎం పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమలను నెలకొల్పడంలో భూసేకరణలో రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌కు 500 ఎకరాల స్థలం వెచ్చించాలని సూచించారు. తిరుపతి నగర పరిధిలో ఐటీ పార్క్‌కు 50 ఎకరాల స్థలం కావాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లు పొందిపింఛన్లు తీసుకుంటున్నారని, అలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకునేందుకు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సవరించాలని కోరారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ ఆక్రమణలపై సీఎం ఆరా తీశారు. 22ఏ అసైన్‌మెంట్‌ల్యాండ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతికి జిల్లాలో గుంతల్లేని రహదారులు ఉండాలని, ఇచ్చిన నిధులతో సాధ్యమైనంత త్వరగా రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలని అన్నారు. సారా, గంజాయి, అక్రమ మద్యంపైనా దృష్టి సారించాలని ఎస్పీ సుబ్బరాయుడుకు సీఎం సూచించారు.


నుజ్జునుజ్జయిన కార్లు

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు



చంద్రగిరి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని తొండవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన సీహెచ్ గిరిధర్ తన కుటుంబ సభ్యులతో కాణిపాకంలో వినాయకస్వామిని దర్శించుకుని కారులో తిరుపతికి బయలుదేరారు. మండలంలోని ముంగిలిపట్టుకు తిరుమలేష్, అతని స్నేహితులు తిరుపతికి చెందిన హేమంత్, లిఖిత్ కుమార్, గౌరీశంకర్, చరణ్‌కుమార్ కారులో తిరుపతి నుంచి చిత్తూరు వైపు అతివేగంగా వెళుతున్నారు. తొండవాడ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ ఎదురుగా వాహనాలు వచ్చే రోడ్డులోకి దూసుకెళ్లింది. ఆ క్రమంలో గిరిధర్ వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సీహెచ్ గిరిధర్, కాత్యాయని, వాణి, కేవీఎస్ ప్రసాద్, డ్రైవర్ వెంకటేష్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. అదేవిధంగా ఢీకొన్న కారులోని ఐదుగురు స్నేహితులకూ గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో మజ్దూర్ యూనియన్‌కు, సంఘ్‌కు గుర్తింపు

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వేలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లకు గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఈనెల 4, 5, 6, తేదీల్లో రైల్వేలో పోలింగ్ జరిగింది. గురువారం లెక్కింపు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో 78,434 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 32,371ఓట్లతో 47.46 శాతం, ఎంప్లాయిస్ సంఘ్ 29,266 ఓట్లతో 42.91 శాతం సాధించి అర్హత సాధించాయి. మిగిలిన డీఎంఆర్‌కేఎస్ 5,634 ఓట్లతో 8.26 శాతం, ఐఆర్ఎంయూ 286 ఓట్లతో 0.42శాతం, ఆర్ఎంయూ 654 ఓట్లతో 0.96 శాతం సాధించాయి. దీంతో ఈ మూడు సంఘాలను పరిగణనలోకి తీసుకోలేదు. గుంతకల్లు డివిజన్‌లో ఎంప్లాయిస్ సంఘ్ 243 ఓట్లతో పైచేయి సాధించింది. దీనిపై సంఘ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

- విజయశంకర్‌స్వామి -


మాట్లాడుతున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుడి విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టీటీడీకి సమర్పించామన్నారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని, అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రక్షాళన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టీటీడీ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసియోధ లోకనాథ్, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, ఖదిజ్ఞాసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని రైతులందరికి చేర్చాలి

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు


అవార్డులు అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతి రామయ్య

తిరుపతిరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని గ్రామీణ స్థాయిలో రైతులదరికీ అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ యువపరిశోధకులకు సూచించారు. వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పశు వులకు సంబంధించిన పలురకాల వ్యాధులు, వాటి నియంత్రణకు వినియోగించే మందులు, వ్యాధి నిర్ధారణ సాంకేతికత, ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పశుసంపద పెంపునకు కృషిచేయాలని ఆకాంక్షించారు. వెటర్నరీడీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతిఏటా వర్సిటీలో జాతీయస్థాయి సదస్సుని నిర్వహించి, దేశంలోని పశువైద్యవిద్య పరిశోధకులని గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య, కో-ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వాయిదా వేయండి: సీపీఎం

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుపాను వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సదస్సులు వాయిదా వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజ జేసీ శుభం బన్సాల్‌ను కోరారు. చాలా ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయని, గతంలో నిండిపోయిన చెరువులు గండ్లు పడే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తుపాను సహాయక చర్యల నేపథ్యంలో సదస్సులు వాయిదా వేయాలని విన్నవించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పలమనేరులో అదృశ్యమైన పిల్లలు కోలారులో ప్రత్యక్షం


హుసేన్, రోషన్

పలమనేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంటావూరుకు చెందిన ఇర్షాద్ కుమారులు హుసేన్(9), రోషన్(8)లు కోలారు వద్ద తారసపడ్డారు. బుధవారం వీరిద్దరూ ఇంటి నుంచి సైకిళ్లపై బయటికి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఈ పిల్లలు బెంగళూరులోని తమ అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు సైకిళ్లపై వెళ్లా కోలారు వద్ద స్థానికులకు తారసపడ్డారు. వారు విచారించి పలమనేరులోని ఇర్షాద్‌కు సమాచారమిచ్చారు. ఇర్షాద్ వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకు వచ్చారు.

పొలాలపై ఏనుగుల దాడి


నేలకొరిగిన కొబ్బరిచెట్లు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంగంవారిపల్లె గ్రామ సమీపంలో బుధవారం రాత్రి సర్పంచ్ రవిచంద్రబాబుకు చెందిన మామిడిచెట్లను, కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. 8 మామాడిచెట్లు, రెండుకొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామసమీపంలోని వరి, కూరగాయల పంటలను తొక్కి నాశనం చేసినట్లు బాధిత రైతులు లబోదిబోమన్నారు. కొంతకాలంగా సద్దుమణిగిన ఏనుగుల సంచారం మళ్లీ మొదలు కావడంతో అటవీ సరిహద్దు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి ఏనుగుల బారినుంచి పంటలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర' డాక్యుమెంట్ ఆవిష్కరణ


విజయవాడకు వెళ్లే వాహనాలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ - 2047లో భాగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన స్వర్ణాంధ్ర అలియాస్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను సీఎం చంద్రబాబు శుక్రవారం విజయవాడలో ఆవిష్కరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్తున్న ప్రముఖులు, రైతులతో కూడిన వాహనాలను ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చిత్తూరు నుంచి ఆరు బస్సులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిందని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, డ్వామా పీడీ రవికుమార్, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, డీఎల్డీవో రవికుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు ఆదరణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులకు రైతులు భారీగా తరలివస్తున్నారు. గురువారం జరిగిన సదస్సులకు 1,938 మంది హాజరయ్యారు. ఆరు రోజులుగా వచ్చిన రైతుల సంఖ్య 15,002కు చేరింది. ఇంతవరకు 2,863 అర్జీలు రాగా, గురువారం 638 అందాయి. ఆర్వోఆర్‌కు 236, ఇళ్ల స్థలాలకు 30, రీసర్వే కోసం 33, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 63, ఇతరత్రా సమస్యలపై 109, గ్రామసచివాలయాలు, మీ-సేవలపై 50, ఏజెన్సీ ల్యాండ్ సమస్యలపై 15 అర్జీలు ఉన్నాయి. ఇప్పటివరకు సదస్సులు జరిగిన గ్రామాల సంఖ్య 169కి చేరింది.

నేడు కూటమి పార్టీల ఆధ్వర్యంలో రైతుల ర్యాలీ

● చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీ ఆధ్వర్యంలో చిత్తూరులో శుక్రవారం రైతులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సాధించిన విజయాలను గుర్తుచేస్తూ ర్యాలీ నిర్వహిస్తారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి.. అరాచక పాలన సాగించిన వైనాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. ఆరునెలల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తిరిగి పట్టాలెక్కించిందని, రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందని వివరించారు. ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు భారీగా హాజరుకావాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం నగరానికి మహేష్ అనే యువకుడు పదో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేశారు.

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య


తులసీరాం తేజ (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్వేటినగరం మండలం కత్తెరపల్లె కాలనీకి చెందిన తులసీరాం తేజ (15) స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సక్రమంగా చదవడం లేదని తండ్రి మందలించడంతో బుధవారం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి తన ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకున్నట్లు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కంచర్ల శ్రీకాంత్, స్నేహారెడ్డి

తిరుమల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రుయాకు ఐఓసీ వైద్య పరికరాల వితరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చొరవతో రుయాలో రోగుల కోసం దాదాపు రూ.10 లక్షల విలువచేసే వైద్య పరికరాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు అందించారని సూపరింటెండెంట్ రవి ప్రభు గురువారం తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, చిన్నపిల్లల విభాగాల్లో అవసరమైన వైద్య పరికరాల వివరాలను ఇటీవల కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. వెంటనే ఆయన ఐఓసీ దృష్టికి తీసుకెళ్లారని వివరించారు. దీంతో వారు పరికరాలు అందించారని తెలియజేశారు. వీటిని ఇప్పటికే ఆయా విభాగాలకు అందజేశామని త్వరలోనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

దీపోత్సవానికి వెళ్తుండగా ప్రమాదం

బస్సు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలు


ఇన్నోవాను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పెద్దపంజాణి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై వెళ్తున్న భక్తులు గాయపడిన వైనమిది. పోలీసుల కథనం మేరకు అనంతపురం జిల్లా తనకల్లు మండలం బొంతపల్లెకు చెందిన రమేష్, నగేష్, చీకటిమానుపల్లెకు చెందిన మంజునాథ్, బి.కొత్తకోట మండలం కొత్తపల్లెకు చెందిన నాగరాజు, మొలకలచెరువుకు చెందిన అరవిందరెడ్డి గురువారం తిరువణ్ణామలై దీపోత్సవంలో పాల్గొనడానికి ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. వర్షం కారణంగా పెద్దపంజాణి మండలంలో ముత్తుకూరు క్రాస్ వద్ద ఇన్నోవాను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్, నాగరాజు, మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపంజాణి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని 108 అంబులెన్స్‌లో పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పంచాయతీలకు 'సిరి'

- భూ బదలాయింపు సుంకం బకాయిలు రూ.44.26 కోట్ల జమ


కక్షిదారులతో కిటకిటలాడుతున్న చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ రూపాల్లో వచ్చే పన్నులు, సుంకాలు, ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి జరుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటూ పైసా కూడా నిధులు విడుదల చేయకపోగా, ఉన్నవాటిని వేరేవాటికి మళ్లించడంతో అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ (భూ బదలాయింపు సుంకం) విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. భూముల కొనుగోళ్లు, అమ్మకాల సమయంలో ఆయా గ్రామాల పరిధిలో రిజిస్ట్రేషన్ల శాఖ విధించే భూబదలాయింపు సుంకం 2022, 2023లో భారీగా ప్రభుత్వం బకాయి పడింది. ఈ బకాయిలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

రిజిస్ట్రేషన్ శాఖలో జమ అయినా..

పంచాయతీ పరిధిలో భూమి క్రయ, విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాలి. అలా చెల్లించిన స్టాంపు డ్యూటీలో కొంత మొత్తాన్ని ఆయా పంచాయతీలకు జమచేయాలి. ఇది ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన భూమి ధరలు, అక్కడ జరిగే క్రయ, విక్రయాలను బట్టి ఉంటుంది. సంబంధిత రుసుం నేరుగా రిజిస్ట్రేషన్ శాఖకు జమవుతుంది. అక్కడినుంచి పంచాయతీ ఖాతాలకు జమ చేస్తారు. వైసీపీ పాలనలో ఈ ప్రక్రియ గాడి తప్పింది. స్థానిక సంస్థలకు దక్కాల్సిన వాటాను జమచేయలేదు. దాంతో గ్రామాల్లో పాలన పడకేసింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ జిల్లావ్యాప్తంగా నిధుల విడుదలకు కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో గ్రామపంచాయతీలకు రూ.44.26 కోట్లు విడుదల చేశారు.

నిధుల విడుదల ఇలా..

2022, 2023 భూబదలాయింపు బకాయిలు గ్రామ పంచాయతీలకు ఈ మేర విడుదలయ్యాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా.. బంగారుపాళ్యం నుంచి రూ.2,00,18,359, పలమనేరు నుంచి రూ.7,46,07,272, పుంగనూరు నుంచి రూ.5,84,29,085, కుప్పం నుంచి రూ.6,07,49,809, చిత్తూరు రూరల్ నుంచి రూ.6,21,41,594, చిత్తూరు నుంచి రూ.12,40,81,400, కార్వేటినగరం నుంచి రూ.1,33,11,952, నగరి నుంచి రూ.2,92,63,004 నిధులు గ్రామ పంచాయతీలకు జమ చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు షురూ

- మొదటి విడతలో ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య సర్వీసులకు
- జిల్లాలో ఇప్పటికే 10520సర్వీసులకు ఏర్పాటు
- రెండో విడతలో అన్ని క్యాటగిరీలకు ఏర్పాటు


చిత్తూరు రెడ్డిగుంటలోని స్ట్రీట్‌లైట్స్‌కు అమర్చుతున్న స్మార్ట్ మీటరును పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు, వాణిజ్య సముదాయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వేగవంతమైంది. నెల రోజులుగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని అమర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతమున్న ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్(ఐఆర్) పోర్ట్ మీటర్ల స్థానంలో వీటిని అమర్చుతున్నారు. తొలుత జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు అమర్చాలనుకున్నారు. వాటికి ప్రీ పెయిడ్ విధానం అమలు చేశాక మిగతా కనెక్షన్లకు వర్తింపజేయనున్నారు. అనంతరం వివిధ దశల్లో గృహాలు, దుకాణాలు, పరిశ్రమలకు అమర్చనున్నారు.

● ముందుగానే రీఛార్జ్....

ప్రస్తుతం నెలకొసారి రీడింగ్ తీసి బిల్లు జారీ చేస్తున్నారు. తీసిన తేదీ నుంచి 15 రోజుల్లోపు చెల్లించే వెసులుబాటు ఉంది. అప్పటి నుంచి మరో 15 రోజుల్లో అపరాధ రుసుం రూ.100తో చెల్లించవచ్చు. అప్పటికీ జమచేయకుంటే సర్వీసును తొలగించే అధికారం విద్యుత్ సిబ్బందికి ఉంది. తాజాగా అమర్చనున్న స్మార్ట్ మీటర్లకు విద్యుత్ వినియోగం ఆధారంగా ముందుగానే రీఛార్జి(ప్రీ పెయిడ్) చేసుకోవాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్లు అమర్చినా ప్రస్తుతానికి స్కానింగ్ విధానంలో బిల్లులు ఇస్తారు.

● బకాయిల నుంచి విముక్తి....

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ సంస్థకు బిల్లుల బకాయిల నుంచి విముక్తి లభించనుంది. జిల్లా పరిపాలనకు తలమానికమైన కలెక్టరేట్ నుంచి గ్రామ పంచాయతీల వరకు విద్యుత్ బిల్లుల బకాయిలున్నాయి. ప్రస్తుతం ఆ మొత్తం సుమారు రూ.600 కోట్లు పైమాటే. పురపాలక, పంచాయతీలు, తాగునీటి పథకాలు, ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన సర్వీసుల్లో బకాయిలు అధిక మొత్తంలో ఉన్నాయి. స్మార్ట్ మీటర్లతో పాటు, ప్రీ పెయిడ్ అమల్లోకి వస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో ముందస్తుగా చెల్లించడానికి ఆర్థిక వనరులు ఉంటాయా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.

● 10520 సర్వీసులకు మీటర్ల ఏర్పాటు

జిల్లాలో మొత్తం 6.36 లక్షల సర్వీసులుంటే అందులో ప్రభుత్వ సర్వీసులు 18 వేలు, వాణిజ్య సర్వీసులు 42 వేలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సర్వీసులకు 5020, వాణిజ్య సర్వీసులకు 5500 స్మార్ట్ మీటర్లు మొత్తం 10520 సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

● వ్యవసాయ సర్వీసులకు మినహాయింపు

వైసీపీ ప్రభుత్వ హయాంలో గృహ, ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులతో పాటు వ్యవసాయ సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారని చెప్పడంతో రైతులతో పాటు అప్పటి విపక్షాలు వ్యతిరేకించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబోమని స్పష్టం చేశారు.

● సర్వీసుల వివరాలు

సాధారణ సర్వీసులు - 6.36 లక్షలు
ప్రభుత్వ సర్వీసులు- 18 వేలు
వాణిజ్య సర్వీసులు - 42 వేలు

● చిత్తూరులో వేగంగా జరుగుతోంది



పక్క జిల్లాలతో పోల్చితే చిత్తూరు జిల్లాలో వేగంగా స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సర్వీసులకు పూర్తి చేసి వాణిజ్య సర్వీసులకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. తర్వాత గృహాలకు ఏర్పాటు చేస్తాం. వ్యవసాయ సర్వీసులకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ మీటర్లు ఎంతో దోహదపడతాయి. - ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

కలుజులో జారిపడి రైతు మృతి



శ్రీకాళహస్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొలానికి వెళుతూ కలుజు వద్ద కాలు జారిపడి రైతు శ్రీనివాసులు(60) మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం అబ్బాబట్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. అబ్బాబట్లపల్లికి చెందిన శ్రీనివాసులు గురువారం ఇంటి నుంచి పొలానికి వెళ్లే క్రమంలో కలుజు వద్ద నీటిలో పడటంతో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. కుటుంబ సభ్యులు ఏర్పేడుమండలం చెల్లూరు గ్రామానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు.

అగ్రి-టెక్నాలజీపై వర్క్‌షాప్


ప్రతినిధులకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రొఫెసర్ మమత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ దాకా ఈ కార్యక్రమం జరగనుంది. తిరుపతి బీసీ, నిమ్మ పరిశోధనా కేంద్రానికి చెందిన డాక్టర్ మధుమతి మాట్లాడారు. వ్యవసాయ సాంకేతిక విద్య చదువుకున్న వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ రమేష్ మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రొఫెసర్ డీఎం మమత, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణి డ్యాంలో చేరుతున్న వరద నీరు


కల్యాణీ డ్యాంలో సగం వరకు చేరిన నీరు

చంద్రగిరి, డిసెంబరు 12: వర్షాల కారణంగా మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో కళ్యాణీ డ్యామ్‌లో వరద నీరు చేరుతోంది. ఇటీవల, ప్రస్తుతం కురిసిన వర్షాలకు 864 అడుగుల వరకు నీటిమట్టం చేరింది. తిరుమల, తిరుపతి ప్రజల దాహార్తి తీర్చేందుకు 1977లో ఈ డ్యామ్‌ను ప్రారంభించారు. శేషాచలం అడవుల్లోని రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు వాగు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి ఈ డ్యామ్‌లోకి వరద నీరు వస్తుంది. 875 అడుగుల ఎత్తులో మూడుగేట్లు ఏర్పాటు చేశారు. డ్యామ్ గేట్లు ఎత్తితే శ్రీనివాస మంగాపురం, మిట్టపాలెం మీదుగా బుచ్చినాయుడుపల్లె సమీపంలో స్వర్ణముఖినదిలోకి వరద నీరు కలుస్తుంది. ఈ పదేళ్ల కాలంలో 2015లో ఒకసారి అప్పటి సీఎం నారా చంద్రబాబు చేతుల మీదుగా గేట్లు ఎత్తారు. 2020 డిసెంబరులో ఒకసారి, 2021 నవంబరులో ఒకసారి గేట్లు ఎత్తారు. మరో వారం రోజులు వర్షం కురిస్తే కళ్యాణీ డ్యామ్ నిండే అవకాశాలున్నాయని డ్యామ్ అధికారులు తెలిపారు.

నిండుగా నదులు.. పొంగుతున్న వాగులు


చెరువులా మారిన తిరుపతి బస్టాండు


తడ వద్ద నదిలా జాతీయ రహదారి

తిరుపతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లాలో స్వర్ణముఖి, కాళంగి, కైవల్య నదులు నిండుగా పారుతున్నాయి. శ్రీకాళహస్తిని ఒరుసుకుంటూ స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఇదే నది పెళ్లకూరు మండలంలో పోటెత్తిదూకుతోంది. వెంకటగిరిలో కైవల్య నది ఉధృతంగా ఉంది. సూళ్లూరుపేటలో కాళంగి ఉధృతి పెరిగింది. నాయుడుపేటలో మామిడి కాలువ పొంగింది. జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో 43 బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు.కేవీబీపురం మండలంలో పూడి ప్రాంత గ్రామాలకు వెళ్ళే వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు స్థంభించాయి. రేణిగుంట మండలం గాజులమండ్యం-కల్లూరు మార్గంలో కల్లూరు కాలువ, అన్నాస్వామిపల్లి మార్గంలో వాగు, అత్తూరు వాగు వంటివి పొంగడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు.బీఎన్ కండ్రిగ మండలంలో సీత కాలువ, పంది కాలువ, కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను పూర్తిగా ఆపేశారు. వరదయ్యపాలెం మండలంలో గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరు గ్రామం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్వర్ణముఖి ప్రవాహ ఉధృతి కారణంగా శ్రీకాళహస్తి నుంచీ పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు ఆపేశారు. ఇదే మండలం ఊళ్ళపూడి ఎస్టీ కాలనీ, ఉడవలపాడు, ముచ్చువోలు, గంగలపూడి, ఓబులాయిపల్లి, దొమ్మరపాలెం గ్రామాల వద్ద వాగులు పొంగాయి. కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు, చిట్టత్తూరు మార్గాల్లో కాలువలు పొంగడంతో రాకపోకలు ఆగాయి. వడమాలపేట మండలం నేసనూరు వద్ద వాగు పొంగడంతో రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. వడమాలపేట మండలం గూళూరు చెరువు నిండిపోయి కలుజు పారుతోంది.వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో ఓ కారు చిక్కుకుపోయింది. ఏర్పేడు మండలంలో సీత కాలువ ప్రవాహవేగం పెరగడంతో గుడిమల్లం ఆలయానికి భక్తుల రాకపోకలను అధికారులు ఆపేశారు. కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్ పది గేట్లు ఉదయం పది గంటలకే ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్‌లోకి నీరు వస్తోంది. నాలుగు గేట్లు స్వల్పంగా ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడున్నారు. పిచ్చాటూరు మండలంలో అరణియార్ గేట్లు ఎత్తివేసి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లోకి నీరు చేరుతోంది.

నడిరోడ్డుపై అయ్యప్ప భక్తులు

- శ్రీవారి దర్శనం ఆలస్యమైందని వెళ్లిపోయిన ప్రైవేటు బస్సు డ్రైవర్
- పోలీసుల చొరవతో నెల్లూరు టోల్‌గేట్ వద్ద ఆగిన బస్సు
- అక్కడికి వెళ్లి ఎక్కిన భక్తులు



అయ్యప్ప స్వాములను వదలిపెట్టి వెళ్ళిన బస్సు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 35 మంది అయ్యప్ప భక్తులు తిరుమలకు దర్శనం కోసం ఓ ప్రైవేటు బస్సులో తిరుపతికి వచ్చారు. తిరుమలలో వారికి దర్శనం ఆలస్యం కావడంతో డ్రైవర్ భక్తులను ఎక్కించుకోకుండా వెళ్లిపోయాడు. దీంతో భక్తులు రోడ్డున పడాల్సి వచ్చింది. లింక్ బస్టాండు వద్ద భక్తులు గంటల తరబడి వారి బస్సు కోసం ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో 100కు కాల్ చేశారు. అలిపిరి పోలీసులు వెంటనే తిరుపతి నుంచి నెల్లూరు, కడప జిల్లాల పోలీసులను, టోల్ గేట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ ప్రైవేటు బస్సు నెల్లూరు వైపు వెళుతుందని గుర్తించారు. నెల్లూరు టోల్‌గేట్ వద్ద బస్సును ఆపించారు. అయితే తిరుపతికి వచ్చేది లేదని భక్తులనే ఇక్కడికి రావాలని డ్రైవర్ మొండికేశాడు. చేసేదేమీలేక భక్తులు వేరే బస్సులో అక్కడికి వెళ్లి వారి బస్సులోనే స్వస్థలాలకు వెళ్లారు.

ఆలస్యంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటన

ఇబ్బందిపడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఈనెల 11వ తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా విద్యాశాఖాధికారులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను వర్షంలో తడుస్తూనే విద్యాసంస్థలకు తీసుకెళ్లారు. తీరా అక్కడికి చేరుకున్నాక విద్యాశాఖాధికారులు సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు మళ్లీ విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు గణేష్‌ని విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి (జీవకోన), డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డివిజన్ పరిధిలో హైల స్కిల్డ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిగా పనిచేసే గణేష్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరిగిన గొడవ విషయంలో గణేష్‌పై పోలీసు కేసు నమోదైంద న్నారు. ఇది కారణంగా చూపుతూ విధుల నుంచి తొలగించడం తగదని పేర్కొన్నారు. కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆదేశించినా కాంట్రాక్టర్ అతడిని విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే అతడిని విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డివిజన్ అధ్యక్షులు శరవణ, కలిగిరి డివిజన్ అధ్యక్షులు రెడ్డెప్ప, చిత్తూరు జిల్లా కోశాధికారి రాజు, గణేష్ భార్య వేదవతి పాల్గొన్నారు.

మహా భారత ప్రవచనం ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహా భారత ప్రవచనం ప్రారంభమైంది. అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమాన్ని పది రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలి రోజైన గురువారం ఆది పర్వాన్ని ప్రవచనకర్త జి. రమేష్ బాబు వివరించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



సోమల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం వీడి తమకున్న వ్యాధులు వైద్యులకు తెలపాలని సోమల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ సూచించారు. గురువారం నంజంపేట, పొదలకుంటపల్లెలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వ్యాధులను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స పొందాలన్నారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అమరనాథ్, శ్రీకాంత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి టీడీపీ ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పీఎస్ఎం

కుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్యధిక సభ్యత్వ నమోదుకు కారకులైన కార్యకర్తలకు టీడీపీ అధిష్ఠానం ప్రశంసాపత్రాలను పంపింది. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, పీఎస్.మునిరత్నం వీటిని కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి, గౌరవించడంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ముందుంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ



కుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం కస్తూరిబా గాంధీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న సరస్వతీదేవి విగ్రహాన్ని లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం ప్రతిష్ఠించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు సుబ్రమణ్యంతోపాటు ఇతర సభ్యులు ముందుకు వచ్చి విగ్రహాన్ని పూర్తి చేయడంతోపాటు విద్యార్థులకు అవసరమైన సమావేశవేదికను నిర్మించారు. ఈ రెండింటిని బుధవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పాఠశాల ఎస్వో మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ సలహాదారు ఎ.మహేశ్, దాత సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంతో బాలికల ఆరోగ్యరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న అమరజ్యోతి

చౌడేపల్లె, డిసెంబరు12,(ఆంధ్రజ్యోతి): కిశోర వికాసంతో బాలికల ఆరోగ్య రక్షణ కలుగుతుందని ఏసీ డీపీవో అమర జ్యోతి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, అనీమియా, బాలికల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలు, బాల్య వివాహాల వివాహ నివారణ, బాలికలపై జరిగే నష్టాల నివారణ తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఎంఈవో కేశవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సులోచన, ఎస్‌ఐ నాగేశ్వరరావు, డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా నమోదుపై అధికారుల అలసత్వం

సదుం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంట బీమాకు అధికారులు సహకరించడంలేదరి రైతులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మామిడి, టమోటాలకు కూడా బీమా కల్పించాలని నిర్ణయించింది. ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం తీసుకోవడానికి, ఈ-క్రాప్ సర్టిఫికెట్ ఇవ్వడానికి రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత మండల అధికారులు ఈ విషయంలో చొరవ రైతులు కోరుతున్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: గౌనివారి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న గౌనివారి

శాంతిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టి రైతులను ముప్పతిప్పలు పెట్టిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు విమర్శించారు. సోగడబల్లలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతుల భూసమస్యలు తెలుసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారన్నారు. రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో రాతపూర్వకంగా అందిస్తే అధికారులు సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శివయ్య, టీడీపీ నేతలు గోపాల్, గంట్లప్ప, మంజునాథ్, వెంకటేశ్, బాసూసాబ్, బాలప్ప, కృష్ణప్ప, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి



శేషాద్రి మృతదేహం

సోమల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శివశంకర్ కథనం మేరకు .. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపైకి చెందిన గాండ్ల శేషాద్రి (30) తాపీ మేస్త్రిగా పనిచేసేవాడు. ఈక్రమంలో వారం కిత్రం కలకడ సమీపంలో నిర్మాణ పనులకు వెళ్లాడు. వర్షం ప్రభావంతో పనులు ఆగిపోయాయి. దీంతో గురువారం శేషాద్రి తోటి మేస్త్రి గురునాథంతో కలసి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలు దేరారు. పగడాలవారిపల్లె సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీను ఢీకొన్నాడు. ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న శేషాద్రి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకన ఉన్న గురునాథానికి తీవ్రగాయాలైనాయి. శేషాద్రికి ఇద్దరు పిల్లలు, భార్య గర్భవతి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతుకు తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-బోయకొండ మార్గంలోని కృష్ణాపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన మొగిలప్ప నాయుడు ద్విచక్రవాహనంలో పొలానికి వెళ్లాడు. ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రామకుప్పం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉస్సిగానిపల్లె పంచాయతీ గోవిదంపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ(40)మృతికి టీడీపీ నాయకులకు సంతాపం ప్రకటించారు. తండ్రి తెల్లగడ్డచెన్నప్ప బాటలోనే ఇతను కూడా టీడీపీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడు. టీడీపీ నాయకులు మునస్వామి, రామ్మూర్తి, జయశంకర్, కృష్ణారెడ్డి, మహాదేవి, తదితరులు గురువారం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులు సేకరించిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు వారు అందజేశారు.

ఎస్‌ఎం కృష్ణకు నివాళి

పలమనేరు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణ కుటుంబ సభ్యులకు జిల్లా జనసేన నాయకురాలు చైతన్య ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దివంగత నేత ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్.ఎం. కృష్ణ మరణించడం తీరని లోటని చైతన్య పేర్కొన్నారు.


జనజీవనానికి వాన ఇబ్బందులు



ఎన్ఎస్‌పేటలో అధ్వానరోడ్డుపై అవస్థలు

పుంగనూరు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా పట్టణం, రూరల్ మండలాల్లో గురువారం ఉదయం నుంచి వాన కురవడంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. ప్రభుత్వం సెలవు ప్రకటించినా సమాచారం రావడం ఆలస్యం కావడంతో పలు విద్యాసంస్థలు మధ్యాహ్నం వరకు పనిచేశాయి. స్థానిక ఎన్ఎస్‌పేట మసీదు వద్ద రోడ్డుపై గోతులు పడ్డాయి. ఖబరస్థాన్ వద్ద మురుగునీటి కాల్వలో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయింది. తర్వాత నీటిని మళ్లించారు. పంట, ఆస్తి నష్టాలపై అప్రమత్తంగా ఉండాలని వీఆర్వోలను తహసీల్దార్ రాము ఆదేశించారు.

పోరాటపటిమతో నాయకత్వ లక్షణాలు



సమావేశంలో మాట్లాడుతున్న హఫీజ్ అతావుల్లాఖాన్

పుంగనూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కరించడానికి నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని ఎస్డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్‌అతావుల్లాఖాన్ సూచించారు. గురువారం స్థానిక అంజుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఎస్డీపీఐ కమిటీ ప్రతినిధులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తూ నాయకులుగా తయారుకావాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గర కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జమీర్‌లాల్, తహీర్ యాసుఫ్,కేఎస్.అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పైపు లీకేజీతో వృథాగా తాగునీరు



భైరెడ్డిపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చంద్రబాబు కాలనీలో రక్షితట్యాంకు పైపు లీకేజీవల్ల తాగునీరు వృథాగా పోతోంది. ట్యాంకు నుంచి నీరు సరఫరా అయ్యే పైపు పగిలిపోయింది. దీంతో ట్యాంకులో తాగునీరు నేలపాలవుతోంది. అధికారులు స్పందించి పైపులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో నీరున్నా అన్నదాతకు సాగు కష్టాలు



చెన్నపట్నం చెరువు



నడిగడ్డ కాలువ దుస్థితి

సోమల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీరున్నా ఆయుకట్టదారులు వ్యవసాయం చేయలేక పోతున్నారు. చెరువు కాలువలు పూడిపోయి నీరు దిగువకు సాగక పొలాలు బీడుగా మారుతున్నాయి. పుంగనూరు జమిందార్లు వందేళ్ల కిత్రం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువును నిర్మించారు. ఈ చెరువు 500 ఎకరాలకు మించి ఇరికిపెంట, ఎర్రమిట్ట, వడ్డిపల్లె, రాశెట్టివారిపల్లె, దాసరివారిపల్లె, గుంతచెరువుపల్లె గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తుంది. తూము కాలువ, నడిగడ్డ కాలువ, గెరిగ కాలువ, ఎరమిట్ట కాలువ, మిట్ట కాలువ, పోతురాజు కాలువలుండి వ్యవసాయంకు సాగునీరు సమృద్ధిగా అందించేవి. ఐదేళ్లగా ఇవి పూడిపోయయి. గతంలో సీఎం చంద్రబాబునాయుడు, మాజీ

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచని కాలువలు

మంత్రులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి కూడా గతంలో పరిశీలించారు. గతేడాది వర్షాలతో నిండింది. కానీ ఎగువ తూము మరమ్మతుకు నీరు వృథాగా పోయింది. గ్రామస్తులు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. చెరువు నుంచి సాగునీరు అందక బోర్లు వేసుకుని కొద్దిగా సాగు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లా..



రైతులే తూముకు తాత్కాలిక మరమ్మతులు చేసి లీకేజీని అదుపు చేసుకున్నాం. ఇటీవలే సీఎం చంద్రబాబునాయుడును కలసి చెన్నపట్నం చెరువు దుస్థితిని వివరించాం. ఇరిగేషన్ అధికారులు స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

-శ్రీనివాసులునాయుడు, మాజీ సర్పంచ

మరమ్మతులు చేపట్టండి



సాగునీటి కాల్వల పూడిక తీయకపోవడంతో నీరు చేరక పిచ్చిమొక్కలు పెరిగాయి. ఐదేళ్లగా ఇబ్బందులు పడుతున్నాం. పొలాలు బీడులుగా మారాయి. మూడెకరాలు చెరువు కింద భూమి ఉండీ సాగు చేయలేకపోతున్నాను.

-రాధావతి నాయుడు, ఇరికిపెంట

గ్రామాల్లో జోరుగా రెవెన్యూ సదస్సులు



అన్నెమ్మగారిపల్లె సదస్సులో తహసీల్దార్ బెన్నురాజ్

సోమల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నెమ్మగారిపల్లెలో జరిగిన సదస్సులో బసవపల్లె, అన్నెమ్మగారిపల్లె శశ్మానానికి దారిసమస్య పరిష్కరించాలని గోడు విన్నవించుకున్నారు. దారి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, అటవీ శాఖలకు చెందిన అర్జీలు అందాయి. తహసీల్దార్ బెన్నురాజ్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ●చౌడేపల్లె: ప్రందిళ్లపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు వచ్చానయి మాధవి పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజుఆర్‌ఐ భారతి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. ●సదుం: మండల కేంద్రంలో జరిగిన సదస్సులో 10 అర్జీలు అందినట్లు తహసీల్దారు ఎస్ఎం హుస్సేన్ తెలిపారు. అన్నీ అర్జీలు భూసమస్యకు చెందినవన్నారు.● పుంగనూరు రూరల్: భీమగానిపల్లె సదస్సులో 19 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ జే.రాము తెలిపారు. అందులో 4 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు చెప్పారు. ● రామకుప్పం: మండల పరిధి చెల్డిగానిపల్లె, కెంపసముద్రంలో నిర్వహించిన డిప్యూటీ తహశీల్దారు బాలాజీ వినతి పత్రాలు స్వీకరించారు. సదస్సుల్లో టీడీపీ నేతలు వెంకటరమణ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు నిరంతర అవగాహన: ఎస్‌ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ షేక్ షావలి

సదుం, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): యుక్త వయస్సులోని బాలబాలికల నడవడిక, కదలికలపై తల్లి దండ్రుల నిఘా ఉండాలని ఎస్‌ఐ షేక్‌షావలి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసం-శిక్షకులు-శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ చిన్న వయస్సులో గర్భధారణ, అనర్థాలు, సెల్‌ఫోన్ల వినియోగం, పోషక ఆహారం, యోగా, వాకింగ్, తదితర అంశాలపై కిశోర బాలికలకు నిరంతర అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో రాజశేఖర్, తహసీల్దారు హుస్సేన్, ఎంఈవోలు సిద్దరామయ్య, దామోదర్ పాల్గొన్నారు.

21న విభిన్న ప్రతిభావంతుల వివరాల నమోదు శిబిరం



పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీ

పుంగనూరు రూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాలను ఉచితంగా ఇవ్వడానికి ఈనెల 21న వివరాల నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో భవానీ తెలిపారు. గురువారం బసవరాజ ప్రభుత్వ పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరానికి ప్రతిభావంతులు, వయోవృద్ధులు ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలు తీసుకురావాల్సివుందన్నారు. పుంగనూరు పట్టణ, రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషన్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈవోలు చంద్రశేఖర్, రెడ్డెన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

పుంగనూరు రూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని ఫెమి9సంస్థ ప్రతినిధి అనంతమునిరాజ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంసీవీ డిగ్రీ కాలేజీ ఆవరణలో బాలికలు రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవనశైలిలో మార్పులు, ఆరోగ్యకర ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు.వ్యక్తిగత పరిశుభ్రతతో అనారోగ్యానికి దూరంగా ఉండగలరన్నారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్నాథం చెరువుకు గండి,తాత్కాలికంగా పూడ్చివేత



గండి తాత్కాలిక పూడ్చివేత చర్యలు

సోమల, డిసెంబరు 12: ఆవులపల్లె గుర్నాధం చెరువుకు గురువారం గండి పడింది. చెరువు మధ్యలో గండి పడడంతో రైతులు గుర్తించి కార్యదర్శి మణికుమార్‌తో కలసి తాత్కాలికంగా గండి వేగాన్ని తగ్గించారు. గత వర్షాలకు చెరువు జలకళ సంతరించుకుంది. ఉదయం నుంచి ఎగువ అటవీ ప్రాంత వర్షం నీరు చేరడంతో గండి పడింది. తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ, సర్పంచు కోదండరాజు, టీడీపీ నాయకులు వేణుగోపాల్ నాయుడు ట్రాక్టర్లుతో మట్టి, ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు.. చెరువు కట్ట తెగితే సోమల-పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె,పేటూరులకు రాకపోకలు స్తంభించే ప్రమాదం పొంచి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగినాయనికుప్పం బస్టాప్‌కు సమీపంలోని కల్వర్టు కింద నీళ్లలో ఓ వ్యక్తి మృతదేహం బయటపడింది. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. కల్వర్టు కింద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహంపై దుస్తులు లేవని, సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

ఘనంగా గుర్రప్ప స్వామి వార్షిక వేడుకలు



సోమల, డిసెంబరు 12(ఆంధ్రజ్యతి): కందూరు బోయపల్లీ దిలోని గుర్రప్పస్వామి ఆలయంలో గురువారం వార్షిక ఉత్సవాలు సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి అర్చనలు, హోమాదికార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదారులు తళారి రామకృష్ణ, రెడ్డి ప్రసాద్ తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనిపించని గ్రామ సూచిక బోర్డులు



పొదల మధ్య కె.గొల్లపల్లి సూచిక బోర్డు

కుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సూచిక బోర్డులు కనిపించడంలేదు. ం కూడళ్ల, మలుపుల్లో ఆర్ అండ్‌బీ శాఖ గతంలో గ్రామాల పేర్లను, మార్గాన్ని సూచించేలా బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ బోర్డులు ఉన్నా ఇప్పుడు కనిపించడంలేదు. బోర్డులను పొదలు పెరిగిపోయాయి. ఏ గ్రామం ఎటు వైపు వెళ్లాలో తెలియక కొత్తవారు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రోడ్డుమీదికి వచ్చేలా పెరిగిపోయిన పిచ్చిపొదలవల్ల మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుడుపల్లె నుంచి పొగురుపల్లెమార్గంలో పొగురుపల్లె పంచాయతీ కె.గొల్లపల్లి గ్రామానికి సంబంధించిన సూచిక బోర్డు పొదల మధ్య కనిపించడంలేదు.

నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

రొంపిచెర్ల,డిసెంబరు12: (ఆంధ్రజ్యోతి) ద్విచక్ర వాహనదారులు శుక్రవారం నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సుబ్బారెడ్డి సూచించారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. జరిమానా విధిస్తామన్నారు.

బాల్య వివాహాల నిషేధంపై అవగాహన

పుంగనూరు రూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిషేదంపై అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు సహకరించాలని ఎస్‌ఐ లోకేశ్ కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్ల సమావేశంలో సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన ఆహారంతో పాటు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఈవోలు చంద్రశేఖర్, రెడ్డెన్నశెట్టి, అంగన్‌వాడీ సుపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

రొంపిచెర్ల,డిశంబరు10 (ఆంధ్రజ్యోతి) చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల పంచాయతీల్లో ఈ నెల 14న సాగునీటి సంఘ ఎన్నికలు జరుగుతాయని ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్ తెలిపారు. వీటి పరిధిలో 919 ఓటర్లు ఉన్నారు. కదిరప్పనాయని చెరవుగౌవునిచెరువు, వెంకట్రాయని చెరువు, పెద్దమల్లెలో నాయని చెరువు కమిటీ ఎన్నికలు జరుగుతాన్నారు.

వీడని వానతో రైతుల్లో ఆందోళన





పెదపంజానీ మండలంలో నేలకొరిగిన వరి- రొంపిచెర్ల ప్రాంతంలో ఆకులు రాలుతున్న టమోటా

రొంపిచెర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం కురిసిన తుఫాన్ ప్రభావంతో తోటలు దెబ్బతిన్నాయి, టమోట ఆకులు నల్లగా మారి రాలిపోయాయి. చీడపీడలు వ్యాప్తి చెందాయి. ఈ వర్షాలకు అరకొర పంటకూడా నష్టపోతామని రైతులు వాపోతున్నారు ●సోమల: అల్పపీడన ప్రభావంతో కొత్త చెరువు, దిగువకుంట, పాతచెరువు, కరకమంద సమీపంలోని పాత చెరువు, చిన్నసోమల, అడుసుపల్లె, నరసింహపురం, అన్నెమ్మగారిపల్లెలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కొన్నిచోట్ల వరి పైర్లు నేలవాలాయి. ●సదుం: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ●పెద్దపంజాణి: కోత దశలో ఒబ్బిడి చేసుకోలేక వరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా పంట నేలకొరిగింది. ధాన్యం మొలకలొస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు.



ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటి విడుదల

పెనుమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోజంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఎన్టీఆర్ జలాశయానికి అధిక నీరు చేరింది. దీంతో నీటిని దిగువకు విడుదల చేశారు. మూడు గేట్లు తెరచి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ భరత్‌రెడ్డి తెలిపారు.

వర్షంలోనూ మరమ్మతులు: వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ అజెండా అని విద్యుత్ శాఖ ఏఈ తులసిప్రసాద్ తెలిపారు. గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో చార్వాగానిపల్లె పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. సమాచారం అందుకున్న ఏఈ వెంటనే తన సిబ్బందితో మరమ్మతులు చేయించారు. సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, నవీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

నీవానది పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



నీవానదికి పసుపు, కుంకుమ, పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీవానది పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే జగన్మోహన్ పర్యటించారు. గురువారం సాయంత్రం నగర పాలక అధికారులతో కలిసి తేనబండ, లిల్లీబ్రిడ్జి తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఉదయం నుంచి భారీగా వర్షం కురుస్తుండటంతో నీవానదిలో నీటి ప్రవాహాన్ని గమనించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. నదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూసుకోవాలన్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే నీటి మట్టం పెరిగే అవకాశం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్షాకాలం ఆరంభంలోనే నీవానదిలో పూడిక తీయించి, ఇబ్బందుల్లేకుండా చేశామన్నారు. ఈ సందర్భంగా నీవానదికి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. ఎమ్మెల్యేతో పాటు ఇన్‌చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్థానికులు నాయకులు ఉన్నారు.

ఎడ తెరిపిలేని వాన



అమ్మపల్లె భారతం మిట్ట వద్ద రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

వెదురుకుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో ఎడ తెరిపిలేని వాన గురువారం కురిసింది. ఈ మండలాల్లో జనజీవనం స్తంభించింది. వెదురుకుప్పం మండలంలో 178 చెరువులు ఉంటే అధిక భాగం చెరువులు నిండి కలుజులు పారాయి. వాగులు, వంకలు ప్రవహించాయి. ● కార్వేటినగరం మండలం అమ్మపల్లె మహాభారతం మిట్టకు వెళ్లే మార్గంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కృష్ణాపురం జలాశయం గేటు ఎత్తివేత: కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం గేటును గురువారం రాత్రి ఎత్తినట్లు జలవనరుల శాఖ ఏఈ భాస్కరరాజు తెలిపారు. జలాశయంలోకి ఇన్‌ఫ్లో 1500 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు.

వానొస్తే ఇబ్బంది తప్పదు



చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చినప్పుడల్లా 17వ డివిజన్‌లోని శివాజీనగర్ వీధివాసులకు ఇబ్బంది తప్పడం లేదు. ఈ వీధిలో సిమెంటు రోడ్డు ఎగుడుదిగుడుగా ఉంది. దీనివల్ల వాన కురిసినప్పుడల్లా రోడ్డుపై నీరు నిలుస్తోంది. దీనివల్ల రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై నిలిచిన నీరు



కొత్తపల్లె రోడ్డుపై వర్షపు నీరు

గుడిపాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారగల్లు, కొత్తపల్లె గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలిచిన చోటే మలుపులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు.

చెరువుల్లా వీధులు



గొల్లకండ్రిగలో చెరువును తలపిస్తున్న వీధి

విజయపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపిలేని వర్షంతో జనం ఇబ్బంది పడ్డారు. పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. కమ్మకండ్రిగ, మాధవరం, ఆలపాకం పెద్ద చెరువు మినహా మిగిలిన చెరువులన్నీ నిండుకుండల్లా మారి మొరవ పారుతున్నాయి. కోసలనగరం, పాతార్కాడు, గొల్లకండ్రిగలో వర్షపునీరు వీధులపై పారుతోంది.



వేలావడిలో నీట మునిగిన వేరుశనగ



నగరిపేటలో జలమయమైన వీధి

నగరిలో భారీ వర్షం

నగరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరిలో భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పంటలు నీట మునిగాయి. నగరి మండలంలో 52 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కుశస్థలీ నదిలో వరద ఉధ్రుతి పెరగడంతో అటువైపు వాహనదారులు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరించారు. నాగలాపురం రోడ్డు చివరలోని వంతెన మార్గంలో వెళ్లాలని సూచించారు. ఎంపీడీవో, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా కార్యాలయాల ఆవరణలు జలమయం అయ్యాయి. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించడంతో నగరిలోని రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. చిన్నపాటి వర్షానికి కూడా నగరిపేట వీధులు జలమయం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంగిన వాగులు

ఎస్ఆర్‌పురంతో 15 గ్రామాలకు రాకపోకల కట్



ఉధ్రుతంగా ప్రవహిస్తున్న ఎగువ కమ్మకండ్రిగ వాగు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలో కురిసిన వర్షానికి ఎగువ కమ్మకండ్రిగ, ఆర్ఆర్‌పురం వాగులు పొంగుపొర్లుతున్నాయి. దీనివల్ల మండల కేంద్రంతో 15 గ్రామాలకు రాకపోకలు కట్ అయ్యాయి. ఎగువ కమ్మకండ్రిగ వాగు పొంగడం వల్ల.. జీఎంఆర్‌పురం, పాతపాళ్యం, పాతపాళ్యం హెచ్‌డబ్ల్యూ, సింధూరాజపురం, వడ్డికండ్రిగ, వడ్డి కండ్రిగ బీసీ కాలనీ, దాసరిగుంట, పద్మాపురం, పుల్లూరు, ఎస్ఆర్‌పురం,ఎస్ఆర్‌పురం బీసీ కాలనీ, రాఘవరాజపురం, దిగువ కమ్మకండ్రిగ, మిట్ట హరిజనవాడ, గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ఆర్ఆర్‌పురం వాగు పొంగడంతో ఆ గ్రామం నుంచి కూడా మండల కేంద్రానికి రాకపోకలు బంద్ అయ్యాయి. రాత్రికి వర్షం ఎక్కువయ్యే అవకాశముందని వాగు సమీపంలోని గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో మోహనమురళి హెచ్చరించారు.

పొలాల్లోకి వర్షపు నీరు





బుక్కాపట్నం దళితవాడ వద్ద చెరువును తలపిస్తున్న చెరకుతోట - మొరవ పారుతున్న తూగుండ్రం చెరువు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి మొదలైన గురువారం రోజంతా మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. దీనివల్ల జనజీవనం స్తంభించింది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ వెలవెలబోయాయి. తూగుండ్రం, కొత్త వెంకటాపురం చెరువులు నిండిపోయి మొరవ పారుతున్నాయి. బుక్కాపట్నం దళితవాడ వద్ద చెరకుతోటలో నీరు నిలబడి చెరువును తలపిస్తోంది. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతిలు కలిసి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌పీలకు పలు సూచనలిచ్చారు.

నిండిన చెరువులు



కలుజు పారుతున్న పాలసముద్రం పెద్దచెరువు

పాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం వేకువజామున నాలుగు గంటల నుంచి రోజంతా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉధ్రుతంగా ప్రవహించాయి. చెరువులు నిండి కలుజులు పారి, వర్షపునీరంతా వృథాగా తమిళనాడుకు పోతున్నాయి. కోతకు వచ్చిన సుమారు 70 ఎకరాల వరిపంట దెబ్బతినింది. వెంగ్రాజుకుప్పం వద్ద ప్రవహిస్తున్న వాగును తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ఆర్ఐ దేవి పరిశీలించారు.

మామిడి పంటకూ బీమా

పెనుమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా మామిడి పంట ఎకరాకు ప్రీమియం రూ.1,750 చెల్లించాలి. దీనివల్ల ప్రతికూల వాతారణ పరిస్థితుల వల్ల డిసెంబరు 15 నుంచి మే 31వ తేదీ వరకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలను బీమా కంపెనీ చెల్లిస్తుందని వ్యవసాయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 'అందుబాటులో లేని వ్యవసాయశాఖ అధికారులు' శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 28వ తేదీవరకు అకాల వర్షాలు, చీడపురుగులు, తేమవల్ల నష్టం వాటిల్లినా, జనవరి 1 నుంచి మార్చి 15 వరకు ఉష్ణోగ్రతలో వ్యత్యాసం వల్ల నష్టం జరిగినా, మార్చి 1 నుంచి మే 31 వరకు అధిక గాలులతో పంట నష్టం జరిగితే బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. నష్ట పరిహారాన్ని స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ పరికరాలతో లెక్కిస్తారని తెలిపారు. కాగా, వరి పంటకైతే ఎకరాకు ప్రీమియం రూ.84, వేరుశనగకు ఎకరాకు ప్రీమియం రూ.60లను సీఎస్‌సీ లేదా మీ-సేవ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఇందుకోసం ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, వన్‌బీ జిరాక్స్‌లు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

జనసేనలో చేరిన వైసీపీ సర్పంచ్, శ్రేణులు



వెదురుకుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం, వెదురుకుప్పం మండలాల నుంచి వైసీపీ సర్పంచు, పార్టీ శ్రేణులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. తిరుపతిలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, జీడీనెల్లూరు ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. వీరిలో.. కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి, వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె సర్పంచ్ భారతి కుమారుడు మరకాల కుప్పం చంద్రశేఖర్, ఏపీ అగ్రహారం నుంచి జయచంద్రయ్య, మారేపల్లె నుంచి ప్రతాప్, చవటగుంట నుంచి సాయి, అగ్గి చేనుపల్లె నుంచి మునీంద్ర, దామరకుప్పం నుంచి గోపి, బద్రి ఉన్నారు.

కూటమి పార్టీలు గేట్లు తెరిస్తే వైసీపీలో నాయకులు మిగలరు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు గేట్లు తెరిస్తే వైసీపీలో నాయకులు మిగలరని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డి నియంతృత్వ విధానాలతోనే ప్రజలతోపాటు పార్టీ నాయకుల విశ్వాసం కోల్పోయారన్నారు. వైసీపీ రాజకీయ ముసుగులో ఉన్న నియంత పార్టీగా పేర్కొన్నారు. వైసీపీలో కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్ ఉండదని, చాలామంది నేతలు ఇతర పార్టీల్లో చేరుతున్నారన్నారు. ఇందులో భాగంగానే అవంతి శ్రీనివాస్, గ్రంధి శ్రీనివాస్‌లు వైసీపీకి గుడ్‌బై చెప్పారని వివరించారు. వైసీపీ భారీ కుంభకోణాలు ఆధారాలతో వెలుగు చూడటంతో భవిష్యత్‌లో ఆ పార్టీకి మనుగడ ఉండదని నేతలకు అర్థమవుతోందన్నారు.

హైరోడ్డు విస్తరణకు మసీదు కమిటీ సహకారం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణకు షేషాపిరాన్ మసీదు కమిటీ సహకరించింది. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు ద్వారా వచ్చిన ఎన్‌వోసీని గురువారం కమిటీ సభ్యులు నగరపాలక సంస్థ అధికారులకు అందజేశారు. నగర మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఎమ్మెస్సార్ జంక్షన్ వరకు హైరోడ్డును విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవనాలకు మార్కింగ్ చేశారు. అందులో వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన షేషాపిరాన్ మసీదు స్థలం కూడా ఉంది. ఎమ్మెల్యే జగన్మోహన్ విజ్ఞప్తితో నగరాభివృద్ధికి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో మసీదు కమిటీ చర్చించారు. దీంతో వక్ఫ్‌బోర్డు స్థలాన్ని విస్తరణకు ఉపయోగించుకోవచ్చని ఎన్‌వోసీ వచ్చింది. నష్టపరిహారాన్ని వక్ఫ్‌బోర్డు సీఈవో ఖాతాలో జమచేయాలని కమిటీ సభ్యులు నగరపాలక సంస్థ కమిషనర్‌కు లేఖ ఇచ్చారు. టీడీపీ నగర మైనార్టీ నేతలు ఫిరోజ్, అఫ్జల్ ఖాన్, అన్సర్, అత్తుబాయ్, రఫీ, మూస తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్ బోర్డు పంపిన ఎన్‌వోసీ లేఖను చూపుతున్న సభ్యులు

బాల్య వివాహాలను అరికడదాం

యాదమరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికడదామని డీఎల్వో వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, వైద్యాధికారి శివకుమార్ రెడ్డి, ఎంఈవో రుక్మిణి, ఈవోపీఆర్డీ, ఏఎస్ఐ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, సీడీపీవో పద్మసునంద, సీఐ హనుమంతప్ప, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సీఐ కృష్ణమోహన్, ఎంపీడీవో నాగరాజు, సీడీపీవో నిర్మల పాల్గొన్నారు.

గుడిపాల: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శ్యామ్‌సుగుణ కుమారి, ఎంపీడీవో శివరాజు, ఎంఈవో గణపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోయజాక్షి, యోగా మాస్టర్ హేమలత పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈ కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని పాత కలెక్టరేట్ వద్ద విద్యుత్ శాఖకు చెందిన చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ నూతన కార్యాలయాన్ని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ గురువారం ప్రారంభించారు. జిల్లాల విభజన జరిగాక చిత్తూరుకు కూడా ఎస్ఈ పోస్టును ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్ఈ కార్యాలయంగా మార్చారు. ఈ క్రమంలో గిరింపేటలోని పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఖాళీగా ఉన్న భవనాన్ని చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయానికి కేటాయించాలని కోరడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ అనుమతించారు. ఈ భవనానికి రూ.7లక్షలతో చేపట్టిన మరమ్మతులు పూర్తవడంతో ప్రారంభించారు. ఈఈలు మునిచంద్ర, సురేష్, జగదీష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈ రోడ్డును బాగు చేయండి



పెనుమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు మార్గంలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. రేణుకానగర్ వద్ద కల్వర్టుకు రంధ్రం పడటంతో దానిచుట్టూ ముళ్లకంపలు వేశారు. మలుపు ప్రదేశంలో రాత్రి పూట కొత్తవారు ఇటుగా వస్తే ప్రమాదం బారిన పడుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగినాయనికుప్పం బస్టాప్‌కు సమీపంలోని కల్వర్టు కింద నీళ్లలో ఓ వ్యక్తి మృతదేహం బయటపడింది. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. కల్వర్టు కింద ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహంపై దుస్తులు లేవని, సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహాదేవమంగళం వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

జైన్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడి జయంతి వేడుకలు



ఆఫీస్ సిబ్బందితో ఆత్మలాల్ జైన్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 100 గొల్లపల్లె వద్ద ఉన్న జైన్‌ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీలో వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ కీర్తిశేషుడు భావర్‌లాల్‌జైన్ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. ఆఫీసు సిబ్బంది, మేనేజర్ షమీర్‌శర్మతో కలిసి భావర్‌లాల్‌జైన్ మనవడు ఆత్మలాల్ జైన్ నివాళి అర్పించారు. ప్రొడక్షన్ మేనేజర్లు అశోక్ విశ్వకర్మ, భావతే, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్ మంగేష్, ఫ్యాక్టరీ ఎక్స్‌టెన్షన్ ఇన్‌చార్జి చంద్ర పాల్గొన్నారు. కాగా, జైన్‌ఫ్యాక్టరీ రెండు ప్లాంట్లకు సంబంధించిన సిబ్బంది, కార్మికులకు చిత్తూరు విన్ హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు.

వరసిద్ధుడి సేవలో ఆలయ పునర్నిర్మాణ దాత



శ్రీనివాస్‌కు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

పైపులైన్‌ను బాగు చేయండి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు- వేలూరు రోడ్డులోని ఆక్రమణలను ఇటీవల నగరపాలక అధికారులు తొలగించారు. ఈ క్రమంలో శివాజీనగర్‌కు వెళ్లే ప్రధాననీటి పైపులైన్ దెబ్బతిన్నది. దీనివల్ల వారం రోజులుగా శివాజీనగర్, కృష్ణానగర్, వేలూరు రోడ్డు ప్రాంతాలకు తాగునీరు సరఫరా రావడం లేదు. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి

గుడిపాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి కిలారిపల్లెవాసులు విజ్ఞప్తి చేశారు. శ్రీరంగంపల్లె, కొత్తపల్లె రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సర్పంచ్ పెరీలా, మాజీ జడ్పీటీసీ సుమతి, మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు సోమనాథ్ గౌడ్, కోఆప్షన్ మెంబర్ కార్మేషన్, టీడీపీ నాయకులు బొడెబ్బ నాయుడు, ఆర్ఐ రామ్‌సాయి, మాజీ ఎంపీటీసీ సెల్వినాథన్, పంచాయతీ సెక్రటరీ మోహన్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సదకుప్పం, నల్లంగాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. సదకుప్పంలో 13, నల్లంగాడులో 11 అర్జీలు అందాయని తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం జరిగిన సదస్సులో ఐదు అర్జీలు అందాయని తహసీల్దార్ లోకనాథం పిళ్లై తెలిపారు. డీటీ రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రం: వెంగ్రాజుకుప్పంలో జరిగిన సదస్సులో తహసీల్దార్ అరుణకుమారి, డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెనుమూరు: చింతపెంట పంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో 21 అర్జీలు అందాయని, అధికంగా మ్యుటేషన్‌పై వచ్చాయని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపల్లెలో జరిగిన సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు

సంక్షిప్తంగా..

నేడు కార్తీక దీపోత్సవం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం కార్తీక దీపోత్సవం జరగనుంది. గిరింపేట చెంగల్‌రాయ కొండ సుబ్రహ్మణ్యంస్వామి,గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి, గిరింపేట దుర్గాంబ, దుర్గానగర్ కాలనీలోని సర్వసిద్ధి, 75దొడిపల్లె సప్తకన్నికల, అగస్త్యేశ్వర, కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర, రాజుగుడి ఆలయాల్లో దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు.

దేవరకొండపైనా..

బంగారుపాళ్యం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొగిలి శివాలయానికి అనుబంధంగా ఉండే దేవరకొండపై శుక్రవారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో మునిరాజ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. కొండపై స్వయంభుగా వెలసి ఉన్న పార్వతీ సమేత జలకంఠేశ్వర స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. రాత్రికి శివకోటి భజనలు ఉంటాయని వివరించారు.

ఎస్ఐకి సన్మానం

పాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు గురువారం పార్లమెంట్ టీడీపీ జిల్లా కార్యదర్శి వాసునాయుడు, నేతలు జె.విజయకుమార్‌నాయుడు, రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానం చేశారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. కమిషనర్ నరసింహప్రసాద్ 15 రోజులపాటు సెలవులపై వెళ్లారు. ఎంఈగా ఉన్న వెంకట్రామిరెడ్డిని ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించడంతో గురువారం బాధ్యతలుచేపట్టారు.

ఇన్‌చార్జి సీఐకి సన్మానం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసంతి కొద్దిరోజులు కిందట విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆమెను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల నాయకులు మురళి, ఆనంద్‌బాబు, శరవణకుమార్ సన్మానించారు.

హుండీ లెక్కింపు

వెదురుకుప్పం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయానికి రూ.1,01200 ఆదాయం వచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

నేడు ప్రదోష పూజలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో శుక్రవారం త్రయోదశి ప్రదోష పూజలు జరగనున్నాయి. నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.